

పారా మెడికల్, ఒకేషనల్ కోర్సులపై వినతి

ప్రజాశక్తి-కొత్తపేట

రావులపాలెం జూనియర్ కళాశాలలో పారా మెడికల్, వొకేషనల్ కోర్సులు నిర్వహించాలని ఎంఎల్ఎ బండారు సత్యానంద రావుకు తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొక్కా ప్రసాద్, రావులపాలెం గ్రామస్తులు శనిఆవరం వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ కళాశాలలో సొంత ఖర్చుతో చేరి విద్యను అభ్యసించలేక పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థుల సతమతం అవుతున్నారని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోర్సులను ఏర్పాటు చేసి, బోధన సిబ్బందిని నియమించాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ బండారు సానుకూలంగా స్పందించారు. ఇంటర్ కళాశాల డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రొక్కం ప్రదీప్, నామాడి సోమరాజు, కొల్లి శంకర్, కత్తుల రవికిరణ్, నాగాబత్తుల శ్రీనివాసరావు, బీర సందీప్, ఒరిగేటి బాలరాజు, గంటి కుమార్ రావు, పీతల రాజు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- వర్షాలతో తగ్గిన దిగుమతి
- కేజీ ఉల్లిపాయలు రూ.50 పైనే
- ఉన్న సరుకు ధరను పెంచిన వ్యాపారులు
- పెరిగిన ధరలతో ప్రజల గగ్గోలు



ప్రజాశక్తి-అమలాపురం

కొత్తిమీర రేటు కొండమీదికెక్కింది. పప్పులో వేసుకునే పాలకూర ధర సైతం బాగా ప్రియమైంది. వీటితో పాటు నిన్న, మొన్నటి వరకు అన్ని వర్గాల ప్రజలకూ అందుబాటులో ఉన్న బెండకాయ, దొండకాయ, క్యారెట్ తదితర కూరగాయల ధరలు సైతం క్రమేపీ పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉల్లి ధర కూడా రోజు రోజుకూ పెరుగుతోంది. ఉల్లి ధర టన్ను రూ.51 వేలు పలికి ఆరు నెలల గరిష్ఠానికి చేరింది. అక్కడ కిలో రూ.51 పలుకుతుండగా బహిరంగ మార్కెట్లో కిలో రూ.60 అమ్ముతున్నారు. పప్పు, ఉప్పు కంటే ఆకు కూరల ధరలు భారీగా పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వివిధ రకాల కూరగాయల దిగుమతి బాగా తగ్గింది. మరీ ముఖ్యంగా పాలకూర, కొత్తిమీర, పుదీనా లాంటివి ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో పాటు దేవీ నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదానాల నేపథ్యంలో వ్యాపారులు ఉన్న సరుకు ధరలు అడ్డగోలుగా పెంచేసి దోచుకుంటున్నారు. సాధారణంగా మార్కెట్లలో ఇతర కూరగాయలతో పోల్చితే ఆకుకూరల రేట్లు అన్ని వర్గాల ప్రజలకూ కాస్తంత అందుబాటులో ఉంటాయి. రూ.20 పెడితే నాలుగు నుంచి ఆరు కట్టల పాలకూర, రూ.10 పెడితే కొత్తిమీర, పుదీనా కట్టలు రెండు, మూడు వస్తాయి. కానీ, ఇప్పుడా పరిస్థితే లేదు. చిన్నసైజు పాలకూర కట్ట ధర రూ.20 దాకా చెబుతున్నారు. పది రూపాయలకు కొత్తిమీర అడిగితే ఇచ్చేదే లేదంటున్నారు. మార్కెట్లలో అయితే నాలుగు కట్టల పాలకూర రూ.100కు పైమాటే రూ.200 పట్టుకుని వెళ్తే కనీసం నాలుగైదు రకాల కూరగాయలు కూడా రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల రేట్లు మరో వారంలోగా దిగి వచ్చే అవకాశం ఉందని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. వర్షాల కారణంగానే ఆకుకూరల దిగుమతి తగ్గిందని తెలిపారు. రైతుబజార్లకు సరుకు రాకుండా కొంతమంది వ్యాపారులు నేరుగా రైతులు దగ్గర కొనుగోలు చేసి రవాణా ఛార్జీలను సాకుగా చూపి సామాన్య ప్రజలకు కావాల్సిన కూరగాయలను అందకుండా చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

కూరగాయల రేట్లు రకం కిలోకు
పాలకూర రూ.180-200
కొత్తిమీర రూ.100-120
చిక్కుడు రూ.80-100
టొమాటో రూ.31
వంకాయ రూ.35
బెండ రూ.45
క్యారెట్ రూ.50
దొండ రూ.45
ఉల్లిగడ్డ రూ.54
క్యాప్సికమ్ రూ.70

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రామచంద్రపురం

గ్రామాల్లోని అన్ని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె.గంగవరం మండలం పాణింగపల్లి గ్రామంలో శనివారం మన గ్రామం-మన సుభాష్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా స్థానిక నాయకులు పని చేయాలని, గ్రామస్థాయి సమస్యలను గుర్తించడం, పరిష్కారం చూపడం ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆయన వివరించారు. స్థానిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం మొరార్జీ, నాగేంద్ర, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం సత్యవాడ గ్రామంలో మంత్రి పర్యటించారు. గ్రామ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా నాయకులు ప్రణాళికల రూపొందించుకుని అమలు చేయాలన్నారు. తాము సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి వివరించారు. సత్యవాడ గ్రామ సర్పంచ్ సలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాణింగపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్



రావులపాలెంలో ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

వైద్య సదుపాయాల కల్పనకు దాతల కృషి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పించడంలో దాతల కృషి ఎనలేనిదని రాష్ట్ర మాజీ మంత్రి, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండలంలోని అంగర, పడమర కండ్రిక పిహెచ్‌సిల ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బలుసు వసుంధర జ్ఞాపకార్థం రూ.75 లక్షలతో నిర్మించిన పిహెచ్‌సి బ్లాక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మాజీ ఎంఎల్ఎ బిక్కిన కృష్ణార్జున చౌదరి, విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ, డిఎం అండ్ హెచ్ఒ ఎం.దుర్గారావు దొర తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రవాసాంధ్రుడు డాక్టర్ బలుసు సుబ్బారావు జన్మభూమికి మేలు చేయాలన్న ఆశయం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. స్వగ్రామంలో విద్య పేదలకు వైద్య సేవలు, దేవాలయాలు పాఠశాలలు అభివృద్ధి వంటి ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టిన డాక్టర్ సుబ్బారావు తనయుడు డాక్టర్ ప్రదీప్‌లను ఎంఎల్ఎ వేగుళ్ల అభినందించారు. డాక్టర్ సుబ్బారావు 100వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు తొలుత ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ బలుసు సుబ్బారావు భార్య వసుంధర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జెడ్‌పిటిసి పుట్టపూడి సూర్యనారాయణ, రెడ్డి ప్రసాద్, నెక్కంటి బాలకృష్ణ, ఎస్.రామ్‌జీ, పుత్సల శ్రీనివాస్, అంగర పడమర కండ్రిక సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరనాతి ఆదిలక్ష్మి, వెంకటేశ్వరరావు, బలుసు ప్రతాప్, చంద్ర, నిర్మల, కుసుమ, జానకి రామయ్య, డిఎం అండ్ హెచ్ఒ ఎం.దుర్గారావు దొర, వైద్యాధికారి డాక్టర్ పిఎన్ఎస్‌డి,.రత్నకుమారి, జె.మల్లికార్జునుడు, రామారావు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి తినిపిస్తున్న మాజీ మంత్రి కామినేని

15 నుంచి ఇసుక ర్యాంపుల్లో తవ్వకాలు

జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి-ఆలమూరు, రావులపాలెం

ఈ నెల 15 తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఇసుక రాంపుల నుంచి తవ్వకాలు చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపులను పరిశీలిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆలమూరు మండల పరిధిలోని ఆలమూరులో ఇసుక ర్యాంపును, రావులపాలెం మండల పరిధిలోని పొడగట్లపల్లి ఒకటి, రెండు, ఇసుక రాంపులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి ఇసుక తవ్వకాల నిర్వహించేందుకు ఇసుక రాంపులలో ఇసుక తవ్వకాలు నిర్వహించేందుకు అనువైన పరిస్థితులు ఉన్నదీ లేనిదీ మరియు గోదావరి వరద నీరు తగ్గిందీ లేనిది పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఇంకా ఇసుక రీచ్‌లలో గోదావరి వరద పూర్తిగా తగ్గలేదని, నీరు తగ్గిన తరువాత ఇసుక రాంపుల్లో తవ్వకాలకు చర్యలు చేపట్టాలని ఆయన సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్, గనులు భూగర్భ శాఖ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల పోరాటంతోనే విజయం

ప్రజాశక్తి - ఆలమూరు

కార్యకర్తలు చేసిన పోరాట ఫలితమే కూటమి భారీ విజయానికి కారణమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని కొత్తూరు సెంటర్లో ఎస్‌జెఆర్ కళ్యాణ మండపంలో టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ విస్తత సమావేశంలో రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, యువ నేత బండారు సంజీవ్‌తో కలిసి శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా చేసిన పోరాటం వల్లే నేడు పార్టీ అధికారంలోకి వచ్చిందని, వారి కృషి అభినందనీయమని కొనియాడారు. వంద రోజుల పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. జనసేన, బిజెపితో కలిసి మెలసి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు రామానుజుల శేషగిరిరావు, కప్పల సునీల్, నాగిరెడ్డి వెంకటరత్నం, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, దొంగ భాస్కరరావు, గుడాల ప్రభాకరరావు, అనుసూరి నాగరత్నం, తాడి శ్రీనివాసరెడ్డి, వడ్డి వెంకన్న, కొమ్ము నారాయడు, దండంగి మమత, వాకా సుబ్బలక్ష్మి, ప్రసన్న, బొమ్మ దుర్గా భవాని, మంగయమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు



దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న సర్పంచ్

ఆరోగ్యకరమైన సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి-అంబాజీపేట

ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించడమే లక్ష్యమని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల పాత్ర కీలకమన్నారు. గంగలకుర్రులో సిద్ధార్థ నగర్ కాలనీ, రజక నగర్, పెదగరువు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉన్నచోట్ల దోమల నివారణకు శనివారం మలాతియాన్ మందు స్ప్రే చేయించామని సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ యు.ప్రశాంతి డి.పుష్పావతి పాల్గొన్నారు.

బాల బాలాజీ ఆదాయం రూ.2.73 లక్షలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి, శ్రీ బాల బాలాజీ స్వామి దేవస్థానానికి శనివారం రూ.2.73 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఇఒ ఎం.సత్య నారాయణరాజు తెలిపారు.
లడ్డూ ప్రసాదం విక్రయం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,14,210, నిత్యాన్నదాన ట్రస్ట్‌నకు రూ.59,299, వెరసి మొత్తం రూ.2,73,509 ఆదాయం వచ్చిందని స్వామి వారిని 4,686 మంది దర్శించుకోగా 3,578 మంది అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు.

సిఎస్ఆర్ నిధుల పనులకు అనుమతి ఇవ్వాలి

ప్రజాశక్తి - అంబాజీపేట

కె.పెదపూడి గ్రామానికి ఒఎన్‌జిసి విడుదల చేసిన రూ.20 లక్షల సిఎస్ఆర్ నిధులతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్టు ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నిధులతో ఆరో ప్లాంట్ షెడ్, శ్మశాన వాటికలో వెయిటింగ్ హాల్ షెడ్డు, బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ అభివద్ధి, ఎస్‌సి కమ్యూనిటీ హాల్ పూర్తి చేసే పనులు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని కోరామన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం కోటిపల్లిలో గోదావరి నది ఒడ్డున నిర్మించే ఆంజనేయ స్వామి ఆలయానికి రాష్ట్రమంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ స్థాన ఘట్టాల వద్ద ఆలయాన్ని గ్రామస్తులు చందాలు వేసుకుని నిర్మిస్తున్నారని మంత్రికి గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి తండ్రి సత్యం, సర్పంచ్ పెమ్మాడి బేబీ సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ర్యాండమైజేషన్ రద్దు

ప్రజాశక్తి-అమలాపురం

ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందికరంగా మారిన రైసు మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసిందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. శనివారం పౌరసరఫరాల శాఖ కమిషనర్ జి.వీరపాండియన్, సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ అమరావతి నుండి వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు జిల్లా పౌర సరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం అమలు చేయనున్న విధి విధానాలైన రైస్ మిల్లుల రిజిస్ట్రేషన్, తనిఖీ, వాహనాలకు జిపిఎస్ కో ఆర్డినేట్స్ అమరిక, బ్యాంకు గ్యారంటీల సేకరణ, కొనుగోలు కేంద్రాలకు సిబ్బంది నియమాకం ఒకటి రెండు దశల్లో శిక్షణ కార్యక్రమాల నిర్వహణ తేమ పరికరాల సమర్థత పరీక్షల నిర్వహణ తేమశాతాన్ని బట్టి తరుగు ప్రక్రియలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సిబ్బందితో మాట్లాడుతూ ఇకపై రైతులు సమీపంలోని తమకు నచ్చిన మిల్లులకే ధాన్యాన్ని తరలించుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింద న్నారు. అందుకు అవసరమైన రవాణా వాహనాలు, గోనె సంచులను సమకూర్చడంతో పాటు ధాన్యం ఎగుమతి, దిగుమతులకు అయ్యే లేబర్ ఛార్జీలను కూడా చెల్లించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో అపోహలకు తావులేకుండా రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ధాన్యాన్ని సేకరించాలని, ఆ ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసే వాహనాలను జిపిఎస్ పరికరాల ద్వారా పర్యవేక్షణతో పాటు లోడింగ్, అన్‌లోడింగ్‌లో జాప్యాల నివారణకు విఆర్ఒ, విఆర్ఎలను క్లస్టర్ వారిగా నియమించాలని ఆదేశించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా తగినంత మంది హమాలీలను నియమించు కోవాలన్నారు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా పటిష్టమైన కార్యాచరణ పర్యవేక్షణ కోసం మండల స్థాయి, డివిజన్, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేస్తామన్నారు. నవంబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ లోపు సన్నద్ధత కార్యక్రమాలైన తేమ పరికరాల క్యాలిబ్రేషన్ పరీక్షలు, అన్నిచోట్ల వేయింగ్ బ్రిడ్జిలు తనిఖీ చేయించాలన్నారు. ఈ వారంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మొదటి దశ శిక్షణ తరగతులను నిర్వహించాలని సూచించారు. ఈ నెలాఖరులోపుగా రైస్ మిల్లర్ల నుండి బ్యాంకు గ్యారంటీలను సేకరించాలని ఆమె ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ తదుపరి రెండవ దశ శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. ఈ లోపుగా ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన డమ్మీ పోర్టల్‌పై టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ అసిస్టెంట్ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. తేమ శాతం 17 గా నమోదు అయితే క్వింటాల్ ధాన్యానికి తరుగు ఉండదని, తేమ శాతం 18గా ఉంటే ఒక కేజీ తరుగు, 19 శాతం అయితే 2 కేజీల తరుగు, 20 శాతం ఉంటే మూడు కేజీల తరుగు, 21 శాతం ఉంటే నాలుగు కేజీల తరుగు, 22 శాతం లేదా ఆ పైబడి ఉన్న ధాన్యానికి క్వింటాలుకు ఐదు కేజీలు తరుగుగా నిర్దేశించారన్నారు. చౌకధరల దుకాణాలకు సంబంధించి మొబైల్ డిస్పెన్సరీ యూనిట్లు పనితీరుపై తనిఖీ చేయాలని ఆమె డిఎస్ఒ ఉదయ భాస్కర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సహాయ మేనేజర్ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

మాచవరం కార్యదర్శిగా సత్యనారాయణ

ప్రజాశక్తి - అంబాజీపేట

మాచవరం గ్రామపంచాయతీ కార్యదర్శిగా కంకిపాటి వీర వెంకట సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అల్లవరం మండలం గోడిలంక, తూర్పులంక కార్యదర్శిగా పని చేసి బదిలీపై మాచవరం వచ్చారు. కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణకు పంచాయతీ సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి సుబ్బారావు ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ సుంకర నాయుడు వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు. బాధ్యతలు తీసుకున్న కార్యదర్శి మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామంలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకు మాచవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జిజివికె.కుమార్ మామిడికుదురు మండలం మొగలికుదురు బదిలీ అయ్యారు.

కార్టూ'నిజం'





ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

బాలిక వైద్యానికి మంత్రి సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం పాణింగపల్లిలో క్యాన్సర్ బాధిత బాలిక పాము నవ్యశ్రీకి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పాము గణితా దేవి కుమార్తె నవ్యశ్రీ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధ పడుతోంది. గ్రామానికి వచ్చిన మంత్రి సుభాష్‌కు గ్రామస్తులు ఈ విషయం తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావేదిక

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం


సత్వర సమస్యల పరిష్కారానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎంతగానో దోహదపడుతుందని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంఎల్ఎ ఆనందరావు మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై ప్రజలు ఎంఎల్ఎ ఆనందరావుకు ఆర్జీలు అందజేశారు. ప్రతి ఒక్క అర్జీని పరిశీలించిన ఎంఎల్ఎ సంబంధిత అధికారుల దృష్టికి అర్జీ తీసుకువెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. మళ్లీ సమస్యల పరిష్కార వేదిక జరిగే నాటికి ఇప్పుడు తన దృష్టికి వచ్చిన ఆర్జీ సమస్యలన్నీ పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్న ముందు చూపుతో సిఎం చంద్రబాబు రాష్ట్రంలోని అందరు ఎంఎల్ఎలు స్వయంగా మండల కేంద్రాలకు వెళ్లి ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారని తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణ అధికార వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు దేశంలోని ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సిఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకం అన్నారు. సిఎం చంద్రబాబు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ యువ నాయకుడు నారా లోకేష్ ఆలోచన విధానాలతో రానున్న రోజుల్లో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నానని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయా సమస్యలపై 61 అర్జీలు వచ్చినట్టు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, ఎంఎల్ఎస్ మూర్తి తెలిపారు. ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి రాంబాబు, సర్పంచులు చిక్కం పెదబాబు, నల్లా బాపండి, కుంచే బుల్లియ్య, పెయ్యల రాజ్ కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, వాకపల్లి ఈశ్వరి, జొన్నాడ శ్రీదుర్గ ,టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, తహశీల్దార్ వివిఎస్ దివాకర్, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్ శాఖ, హౌసింగ్ ఎఇలు వి.రాధాకష్ణ, కె.సురేష్, టి.శ్రీహరి, డి.శ్రీనివాస్ విద్యాశాఖ అధికారులు కె.కిరణ్ బాబు, ఎస్.సత్యకృష్ణ, ఉపాధి ఎపిఒ, వి.రాజామణి, వెలుగు ఎపిఎం, ఎ.సురేంద్ర ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



పరిష్కార వేదికలో ఎంఎల్ఎ ఆనందరావు

పిఎం కిసాన్ నిధుల విడుదల

ముమ్మిడివరం : పిఎం కిసాన్ పథకంలో జిల్లాకు రు.24.74 కోట్లు విడుదలైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిఎం కిసాన్ పథకంలో భాగంగా రైతుల ఖాతాలకు 18వ విడతగా ఒక్కొక్క రైతు ఖాతాలో రూ.2000 నిధులు జమ అయినట్టు ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు లక్షా 23 వేల 699 మంది రైతులకు గాను రూ.24.74 కోట్లు వారి ఖాతాల్లో జమ అయినట్లు ఆయన పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపిడిఒ

ఆత్రేయపురం ఎంపిడిఒగా వెంకట్రామన్

ఆత్రేయపురం : ఆత్రేయపురం ఎంపిడిఒగా బికెఎస్ఎస్.వెంకట్రామన్ నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయన గండేపల్లి ఎంపిడిఒగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఎంపిడిఒగా పని చేసిన నాతి బుజ్జి గండేపల్లి బదిలీపై వెళ్లారు.

నేరాలు ఘోరాలు

నిల్వ చేసిన ఇసుక, ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

మండలంలోని గాడిమొగ పంచాయతీ పెదవలస చెక్కల వంతెన ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను నిల్వ చేశారు. ఆ ఇసుకను తరలించేందుకు వెళ్లిన ట్రాక్టర్‌తోపాటు, నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ మందాసిద్ధిపై కేసు నమోదు చేసి, ఇసుకను, ట్రాక్టర్‌ను తహశీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు మహిళలకు గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రామవరం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయాలపాలయ్యారు. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి నుండి జగ్గంపేట వస్తుండగా బైక్ ఎదురు రావడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలకి గాయాలయ్యాయి. వారిని జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం


ఆనంద్ మృతదేహం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి యానాం రోడ్డులో కోట గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించాడు. కొవ్వూరు గ్రామం కొత్తపేట వీధికి చెందిన కొజ్జు ఆనంద్ స్నేహితునితో కలిసి యానాం నుండి కోటిపల్లి వైపు వస్తుండగా కోట సరిహద్దులోని రాజవైరి వంతెన వద్ద రోడ్డు సరిగా కనిపించక ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి పడిపోయారు. తీవ్ర గాయాలైన ఆనంద్ (20) అక్కడికక్కడే మరణించాడు. కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యానాం వార్తలు


లెఫ్టినెంట్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎల్‌ఎ అశోక్

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - యానాం రూరల్

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాదన్‌ను శనివారం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను గవర్నర్‌కు వివరించినట్లు ఎంఎల్‌ఎ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని, ప్రతి ఏటా వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, అందుకు రక్షణ గోడను నిర్మించాలని కోరారు. యానాంలో గంజాయి, బైక్ దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు వారిని ఛేదించినప్పటికీ నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కనకాల పేట ఏటిగట్టు మార్గంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కోరారు.

ఘనంగా ఎంపీ వైద్యలింగం పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం రూరల్

పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యులు, పుదుచ్చేరి పిసిసి అధ్యక్షులు వి.వైద్యలింగం 75వ పుట్టినరోజు వేడుకలను యానాం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మల్లాడి సత్తిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులో గల మల్లాడి సత్తిబాబు కార్యాలయం వద్ద అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాడి బీరాస్వామి, దున్నా చక్రవర్తి, లంకె నాగార్, లంకె అంజయ్య, లంకె శ్రీను, వేపాటి వెంకటేశ్వర్లు, లంకె జాన్, పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఘనంగా జాన్ మోజెస్ పుట్టిన రోజు

సామర్లకోట: సామర్లకోట మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉబా జాన్ మోజెస్ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావుల సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి.

ఆశ.. నిరాశ..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

అధికార పార్టీలో నామినేటెడ్ పోస్టులు ఆశించిన అత్యధిక మంది ఆశావహుల ఆశలు ఆవిరయ్యాయి. ఉమ్మడి గోదావరి జిల్లా నుంచి 7 కార్పొరేషన్లలో 14 మందికి మాత్రమే చోటు లభించింది. రాజకీయ, సామాజిక తూకంతో ఎంపిక ప్రక్రియ జరిగిందంటూ మూడు పార్టీల పెద్దలు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. జిల్లా స్థాయిలో సీనియర్లు, కీలక నేతలకు సైతం స్థానం లభించకపోవటంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ అసంతృప్తివాదులను ఆయా పార్టీల ముఖ్యనేతలు ఏ విధంగా బుజ్జగిస్తారో వేచిచూడాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ల పదవులు అలంకార ప్రాయంగా మిగిలిన విషయం విధితమే. నిధులు కేటాయింపులు లేకపోవటతో కనీసం కార్యాలయాలు సైతం ఏర్పాటు చేయని దుస్థితి నెలకొంది. నూతన ప్రభుత్వమైనా ఆయా కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించి క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించేలా ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పులి సంచారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంది. ఆహారాన్వేషణ వదిలి గత కొన్ని రోజులుగా నివాస ప్రాంతాలకు సమీపంలో సంచరించడమే ఈ పరిస్థితి కారణం. తొలుత రాజమహేంద్రవరంలోని హౌసింగ్ బోర్డు సమీపంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు ధ్రువీకరించారు. తాజాగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రత్యక్షం కావడం ప్రజలను మరింత ఆందోళనకు గురి చేస్తుంది. గత కొన్ని రోజులుగా అటవీ శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విఫలం అయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదని తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో వరి కోతల పనులు ప్రారంభం కానున్నాయి. మరోవైపు కడియం మండలంలో నర్సరీ వ్యాపారాలపైనా పులిసంచారం ప్రభావం తీవ్రంగా కన్పిస్తోంది. పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు కొనుగోలుదారులు సైతం వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. మరో వైపు పులి సంచారంపై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారం ఆందోళనకు గురి చేస్తుంది. అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు ప్రజలకు భరోసా కల్పించేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాలన పట్టాలెక్కేనా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తాసిల్దారుల బదిలీలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా నుంచి పలువురు అధికారులు ఇతర జిల్లాలకు బదిలీ కాగా మరి కొందరు ఉమ్మడి జిల్లాలోనే పోస్టింగులు సంపాదించారు. ఈ స్థానచలనాల వెనుక రాజకీయ పెద్దలు ఉన్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అయితే గత కొన్నేళ్లుగా ఒకే పోస్టులో కొనసాగుతున్న వారికి సైతం తాజా బదిలీలు నిరాశను పరిచాయి. జిల్లాలోనే పోస్టింగ్‌లు పొందేందుకు తెర వెనుక పావులు



గోదారి గలగలలు

కదుపుతున్నట్లు తెలుస్తోంది. నూతనంగా ఏర్పడిన తాజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు తగ్గట్టుగా పరిపాలన అందించాల్సి ఉంది. తమ దైన ముద్ర వేసేందుకు ఏ మేరకు ప్రయత్నిస్తారో వేచి చూడాలి.

మద్యం పాలసీపై గుబులు

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పాత విధానాన్నే అమల్లోకి తెస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. గత ప్రభుత్వం నేరుగా దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం విక్రయించి అబాసుపాలైంది. తొలుత దశలవారీ మద్య నిషేధం అని ప్రకటించి మడమ తిప్పింది. నూతన ప్రభుత్వం నాణ్యమైన మద్యం, ధరలు తగ్గిస్తా మంటూ ప్రకటించడంతో ఆందోళన కల్పిస్తుంది. మద్యం మత్తుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వాలు భిన్నంగా వ్యవహరించడం పట్ల మహిళా, ప్రజాసంఘాలు కన్నెర్ర చేస్తున్నాయి.

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పెద్దాపురం

సార్వా వరిలో పంట చివరి దశలో దోమ, ఎండాకు తెగులు ఉధృతిని నివారించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎం.రామభద్రరాజు అన్నారు. శనివారం స్థానిక పరిశోధనా కేంద్రంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారులతో నిర్వహించిన శిక్షణ - సందర్శన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా స్థిరమైన దిగుబడులు సాధించవచ్చనని అన్నారు. గ్రామాల్లో బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు నీటి యాజమాన్యం, నత్రజని ఎరువులు ఆపివేసి మ్యూరేట్ ఆప్ ఫొటోస్ ఎకరాకు 20 కిలోలు చల్లాలన్నారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడారు. వ్యవసాయ అధికారులు బికె.మల్లికార్జునరావు, కాకాడ బాబురావు, వై.జ్యోతిర్మయి, ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ సునీత జిల్లాలోని పంటల స్థితిగతులపై వివరించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - తాళ్ళరేవు రూరల్

ప్లాస్టిక్ వస్తువులు అతిగా ఉపయోగిస్తే క్యాన్సర్‌కు కారకం అవుతాయని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.మహేష్ తెలిపారు. శనివారం చొల్లంగి వివేకానంద పాఠశాలలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో విద్యార్థులకు పలు విషయాలపై ఫారెస్ట్ అధికారులు అవగాహన కలిగించారు. మైక్రో ప్లాస్టిక్ కలిగిన టీ గ్లాసులు, మైకా కవర్లలో వేడి పదార్థాలు ఆహారంగా తీసుకోవడం ద్వారా మైక్రో ప్లాస్టిక్ ఆహారంతో కలిసిపోయి చిన్న, పెద్ద ప్రేగుల్లో పేరుకు పోతుందన్నారు. కిడ్నీ సైతం ఈ మైక్రో ప్లాస్టిక్‌ను ఫిల్టర్ చేయలేదని తెలిపారు. అప్పుడు అవి క్యాన్సర్ కంతులుగా మారి మనిషి ప్రాణాల్ని హరిస్తాయన్నారు. గ్రీన్ క్లైమేట్ ఫండ్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీహర్ష మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం అడవులను సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు ఎస్. వీరభద్రరావు, జి.గోపినాగేంద్ర, సిహెచ్.ధనలక్ష్మి, ఎస్‌కె.సుభాని, విశ్రాంత ఫారెస్ట్ ఉద్యోగి టి.సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ మొండి భీమశంకర్, ఉంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఏలేశ్వరం: మహిళల రక్షణ కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలపై మహిళలు అవగాహనను పెంపొందించుకోవాలని ప్రతిపాడు న్యాయమూర్తి బుల్లెమ్మ పిలుపునిచ్చారు. శనివారం లింగంపర్తి గ్రామంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుగతా శివ పాల్గొన్నారు.

కిక్కిరిసిన వెంకన్న ఆలయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిక్కిరిసింది. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిసి నల్ల చక్రధర్ రావు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. కాలినడకన వచ్చే యాత్రికులతో ఆలయ ప్రాంగణం అంతా శుక్రవారం సాయంత్రానికి కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుండి కాలినడకన వచ్చే యాత్రికులకు విశ్రాంతి తీసుకునేందుకు సౌకర్యాలు కల్పించడంతోపాటు వారికి అల్పాహారం భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం రాత్రి 9 గంటల వరకు యాత్రికుల రద్దీ కొనసాగింది. సుమారు 80 వేల పైబడి యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు.


అక్రమంగా నిర్మిస్తున్న డ్రెయిన్

డ్రెయినేజీ నిర్మాణ పనుల అడ్డగింత

ప్రజాశక్తి -మామిడికుదురు

తాటిపాక నుంచి అక్రమంగా మొగలికుదురులోకి నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను మొగలికుదురు పాలకవర్గం శనివారం అడ్డుకుంది. దీనికి ఏ విధమైన అనుమతి లేదని సర్పంచ్ కడి అరుణకుమారి పాలకవర్గ సభ్యులు స్థానికులు పేర్కొన్నారు. తాటిపాక పంచాయతీకి చెందిన మురుగునీటిని మొగలికుదురు లోకి మళ్ళిస్తుండటంతో ఇప్పటికే ఎన్నో సమస్యలు ఎదుర్కొంటుండగా మళ్లీ శ్మశాన వాటిక సమీపంలో డ్రెయిన్ నిర్మించడం వల్ల సమస్యలు ఇంకా జటిలమవుతాయని పాలకవర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రెయిన్ నిర్మించేందుకు వీలు లేదని వారు స్పష్టం చేశారు

వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

రోగులకు మెరుగైన వైద్యం అందించడం ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిఎం అండ్ హెచ్ఒ ఎం.దుర్గారావుదొర అన్నారు. శనివారం మండలంలోని అంగర పిహెచ్‌సిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులు, వార్డులను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. వైద్యాధికారులు డాక్టర్ రత్నకుమారి డాక్టర్ ప్రియాంక, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు పాల్గొన్నారు.


శిక్షణా తరగతిలో ప్రసంగిస్తున్న ఎడిఎ

డ్రోన్ పిచికారీతో ఎక్కువ ఫలితం

ప్రజాశక్తి -మామిడికుదురు

వరి పంటలో ఎండు తెగులు నివారణకు రైతులు డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుందని ఎస్‌జెవి.రామ్మోహనరావు అన్నారు. నగరం కొత్త రోడ్డులో కడలి రాజు ఇటుకల బట్టీ వద్ద మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోశనివారం వరి యజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎవిసి రాజశేఖర్, వ్యవసాయాధికారి బి.మృదుల మాట్లాడారు. ప్రస్తుతం బ్యాక్టీరియా ఎండు తెగులు అధికంగా ఉన్నందున నత్రజని ఎరువు తగ్గించి పొటాస్ ఎరువులు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, జాలెం సుబ్బారావు, వ్యవసాయ సహాయకులు ఎన్.లలిత, బి.కావ్య పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం


అధ్యాపకులను సత్కరిస్తున్న విద్యార్థులు

సమాజ ఉన్నతికి విశేష కృషి చేసే ఉపాధ్యాయుడు ధన్యుడని అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న వక్తలు అన్నారు. అంగర శ్రీసిద్ధార్థ కళాశాలలో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులు అధ్యాపకులను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లోని విద్యార్థులకు కళాశాల డైరక్టర్ వాకా పరమేశ్వర, చైర్మన్ డాక్టర్ వి.దివ్యశేఖర్, కరస్పాండెంట్ వి.రాజా బహుమతులను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు ఉన్నతంగా రాణించే అవకాశాలు పెరిగాయన్నారు. గ్రామీణ ప్రాంతంలో చదివిన విద్యార్థులెంతో మంది ప్రపంచ నలుమూలలా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చుతున్నారన్నారు. అధ్యాపకులు మాట్లాడుతూ ఆధునిక పరిస్థితులను విద్యార్థులు శాస్త్రీయంగా అర్థం చేసుకుని మెలగాలన్నారు. పోటీ ప్రపంచంలో మంచితో పాటు చెడు సైతం ప్రచారంలో ఉంటుందన్న విషయాన్ని గమనించాలన్నారు. తర్క భావంతో మంచి చెడులను బేరీజు వేసుకుని జీవితంలో నెట్టుకొచ్చే నేర్పును కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సామాజిక అంశాలపై కళాప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.రమణ, సీనియర్ అధ్యాపకుడు రామ్‌గోపాల్, ఎస్ఎస్‌వి.శ్రీనివాస్, కె.పరదేశి, బి.ధనప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలతో ఆటలు : కురసాల

ప్రజాశక్తి - కాకినాడ రూరల్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కురసాల

రాజకీయాల కోసం కోట్లాది భక్తుల మనోభావాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటుందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర స్వామిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసి భక్తుల మనోభావాలతో ఆటలాడుతుందన్నారు. టిడిపి ఆఖరికి దేవుడిని కూడా వదలడంలేదన్నారు. లడ్డూల వ్యవహారం సంఘటన ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగితే అది గత ప్రభుత్వానికి ఆపాదించడం సమంజసం కాదని అన్నారు. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వారిని ఏమాత్రం పట్టించుకోలేదని, ఉచిత ఇసుక అంటూ ప్రభుత్వం గొప్పలకు పోతున్నా రాష్ట్రంలో ఎక్కడా ఇసుక లభించడం లేదన్నారు. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేసేందుకు ఒకపక్క ప్రయత్నాలు జరుగుతుంటే కూటమి నాయకులు ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. మహిళలు స్వేచ్ఛగా రోడ్ పై తిరిగే పరిస్థితి లేదన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని పాలకులే తమకు తాము బాజా కొట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పుల్ల చందు, మోకా కృష్ణంరాజు, ఎలిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే భారీ మెజారిటీ

ప్రజాశక్తి-రావులపాలెం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యానందరావు

కార్యకర్తల సమష్టి కృషి ఫలితంగానే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రావులపాలెం మండలంలో తెలుగుదేశం పార్టీ గత ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించిందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని వెదిరేశ్వరం రోడ్డులో ఉన్న కాపు కళ్యాణ మండపంలో శనివారం టిడిపి మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ సత్యానందరావు మాట్లాడారు. దీనికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కెవి.సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, జక్కంపూడి వెంకటస్వామి, కాసా విజయసాగర్, మేడపాటి కాసురెడ్డి, మాసాబత్తుల ఆనందరావు, కేతా శ్రీను, మైగాపుల తేజ, సిద్దిరెడ్డి శ్రీను, గంటా సుబ్బారావు, సవరపు శ్రీను, కోనాల అంబేద్కర్, నూకపెయ్యి రమేష్, దునేపూడి దుర్గ, కోట వెంకటేశ్వరరావు, వెలగల శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి ప్రసాద్, పడాల బులి కొండారెడ్డి, నందం సత్యనారాయణ, రెహ్మతుల్లా పాల్గొన్నారు.


పకీర్ల సమ్మేళనంలో గంధం ఊరేగింపు

కొమరాడలో ఉరుసు ఉత్సవం

ప్రజాశక్తి- మామిడికుదురు

కొమరాడలో శనిఆవరం హజరత్ మహబూబ్ సభహనీ, కరీముల్లాషా ఖాదర్‌ల ఉరుసు ఉత్సవం నిర్వహించారు. షేక్ గౌస్ స్వగృహం నుంచి పకీర్ల సమ్మేళనంతో కొమరాడ డామ్ సెంటర్ వరకు గంధం ఊరేగించారు. ప్రార్థనా స్థలం ట్రస్టీ ఎండివై.షరీఫ్ ఆధ్వర్యంలో నమాజ్ అనంతరం శాంతి సౌభాతత్వం కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

90 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని యనమదల గ్రామంలో రామచంద్రపురం నేత్ర ప్రాథమిక కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో పది మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఇతర కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో కంటి వైద్యులు సిహెచ్.కుమార్, పి.సాయిలక్ష్మి, వైద్య సేవలు అందించారు.

పాస్‌పోర్టు పోయినది

కొల్లం వినోద్ రాజ్‌కుమార్, S/o. కె.సిహెచ్.వీర్రాజు, డో.నెం. 73-11-4, వెంకట రామయ్య నగర్, 2వ వీధి, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా అను నాకు విశాఖపట్నం కార్యాలయం అధికారులు ది. **24-08-2005** న **F4652373** నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసినారు. సదరు పాస్‌పోర్టు **ది. 12-9-2024వ తేదీన** నేను రాజమండ్రి బస్టాండ్ నుండి నారాయణపురం వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికిన కనిపించలేదు. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

కొల్లం వినోద్ రాజ్‌కుమార్
డో.నెం. 73-11-4, వెంకటరామయ్య నగర్
2వ వీధి, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా
సెల్: 7981017609, 9515967811

సర్టిఫికెట్ పడిపోయినది

ది. 05-10- 2024న బుడితి శరత్‌బాబు, తండ్రి: నాగేశ్వరరావు, ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధికి చెందిన నేను 1997లో డిప్లమో ఇన్ పబ్లిక్ హెల్త్ అండ్ శానిటేషన్ టెక్నాలజీ కోర్స్ పూర్తి చేసియున్నాను. ఇటీవల నా ఒరిజినల్ మార్కు లిస్టులను జిరాక్స్ నిమిత్తము ముమ్మిడివరం హైస్కూల్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా నా డిప్లమో మార్క్ లిస్ట్ ఒరిజినల్ సర్టిఫికెట్ పడిపోయినది. వెంటనే మార్కుల లిస్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా మార్క్ లిస్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను.

ఇట్లు: **బుడితి శరత్‌బాబు**
తండ్రి: నాగేశ్వరరావు, డోర్ నెంబర్.13- 144,
శ్రీ బాలయోగి కెనాల్ రోడ్, ముమ్మిడివరం,
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం.94412 37510

బాధితునికి హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

ప్రజాశక్తి-అమలాపురం సిటీ


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

అల్లవరం మండలం బోడసకుర్రుపాలెంకు చెందిన కడలి శ్యామ్ అనారోగ్యానికి గురై అమలాపురం కిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడు. శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ సేకరించిన రూ.40,000 నగదును హైదరాబాద్ గుత్తుల మీరా కుమార్ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.10,000 నగదును మొత్తం రూ.50,000 శనివారం సంఘం ప్రతినిధులు శ్యామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి వెంకటేశ్వర (బాబు), పిల్లి గంగాధర్, గొవ్వాల రాజేష్, శేఖర్, వనచర్ల రాజేష్, విత్తనాల శేఖర్, చెల్లుబోయిన నాని, కముజు రమణ, దొంగ చిన్న, కాండ్రేగుల శ్రీను, వనచర్ల రాజేష్, ఇళ్ల కిషోర్, కట్టా బుజ్జి, కేతా భాను తేజ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై మహిళలకు అవగాహన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం


న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

స్థానిక ఐకెపి కార్యాలయంలో శనివారం మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో అడ్వకేట్లు బూసి విద్య, ప్రసన్న మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు గృహ హింస నిరోధక చట్టం, నిర్భయ చట్టం, వరకట్న నిషేధ చట్టం, పురుషులతో సమాన వేతనం, బాల్య వివాహాల నిరోధక చట్టం వంటి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళా భారత రాజ్యాంగం కల్పించిన చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. సాటి మహిళలపై ఎక్కడైనా అఘాయిత్యం జరుగుతుంటే ప్రతి ఒక్కరూ స్పందించి పోలీస్ కంప్లెయింట్ ఇవ్వాలని సూచించారు. మన ఇంట్లో పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు. స్మార్ట్ ఫోన్ల వల్ల యువత పక్క దారి పడుతున్నారని తెలిపారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో ఐకెపి ఎపిఎం ఎం.దుర్గా ప్రసాద్, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎఎలు పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE, TENALI
I.A 1854/2024 IN OS 603/2023

Between:
Sankuri Bharathi & another
... Petitioners / Plaintiffs
And
Jyothula Ghana sundara Rao & 7 others
.... Respondents / Defendents

To,
(D2) Jyothula Padmavathi @ Chinthala Padmavathi W/o Krishna Murthy
(D3) Jyothula Pavani D/o Krishna Murthy.
(D4) Jyothula Sumathi D/o Krishna Murthy.
(D5) Jyothula Sumanth S/o Krishna Murthy.
H.No. 13-1-61/1, Kathyani Complex, Opp. Appolo Hospital, Kakinada.

పై నెంబరు దావాలో I.A 1854/2024 IN OS 603/2023 లో మీరు ఉద్దేశ్యపూర్వకంగా ఎన్నిసార్లు నోటీసులు పంపిన తీసుకోక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమనగా ఈ ప్రకటన ఇస్తున్నాము. ది.22-10-2024 వ తేదీన ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ వకీలు ద్వారా గానీ హాజరై ఏమన్నా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేనిచో మీకు పరోక్షంగా తీర్మానం చేయుదురు.

(బై ఆర్డర్ ఆఫ్ కోర్ట్)
వాయిదాతేది : 22-10-2024

Syed Mastan,
Advocate, Tenali.
Cell No. 9848198531

IN THE COURT OF THE 5th ADDL. JUNIOR CIVIL JUDGE, KAKINADA
O.S.No.10 / 2024

Between:
Vasamsetti Anjaneyulu ...Plaintiff
and
Gedhada Veera Venkata Soma Raju ...Defendant

To:
Gedhada Veera Venkata Soma Raju, S/o. G.Venkata Ramana, aged 40 years, Van Driver, Hindu, R/o. D.No.3-57, Kumarapriyam, Pedapudi Mandal, E.G. District

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్సు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం **ది.14-10-2024** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలియ పర్చుకోవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
మేడపాటి రామారెడ్డి, అడ్వకేట్
డో.నెం.23-7-7/1, దుగ్గిరాలవారి వీధి, కాకినాడ, సెల్: 9059429999

In the Court of the Ist Additional Senior Civil Judge, Kakinada
E.P. No. 39/2023
O.S. No. 870/2011

Between:
M.Siddhartha Gowtham, rep. by his G.P.A. Holder M.Satyanarayana
...Decree Holder/ Plaintiff
AND
M/s. Nagarjuna Chits & Finance Ltd., Kakinada, Represented by its Managing Partner
...Judgement Debtor/ Defendant

To:
M/s. Nagarjuna Chits & Finance Ltd., Kakinada, Represented by its Managing Partner, M.S. Prasad, S/o. Venkata Rao, aged 54 years, R/o. D.No. 2-43-44, 1st Floor, Water Tank Road, 50 Building, Kakinada.

పై నెంబరు E.P. లో JDr/ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 22-10-2024** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై E.P. మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.ఎస్.వి.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, డో.నెం. 6-1-9/1, దూసర్లపూడి వారి వీధి, కాకినాడ
సెల్: 98662 11196

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, రాజమహేంద్రవరం వారి కోర్టులో
ఈ.ఎ నెం. 120/2024
ఎ.ఎ.సి.యఫ్. నెం. 199/2019
(సెక్షన్ 50 సి.పి.సి.)

పార్టీలు:
మెసర్స్ జగజ్జనని చిట్‌ఫండ్స్ ప్రయివేటు లిమిటెడ్, రిప్. బై డైరక్టరు ఎ.శ్రీనివాసరావు
-పిటీషనరు
మరియు
పి.మాధవి (డైడ్) మరియు వగైరా
-రెస్పాండెంట్లు

8. వెంట్రపాటి నాగేంద్రరావు, (తండ్రి) (లేటు) వెంట్రపాటి రామకృష్ణరావు, హిందువు, వయస్సు 49 సం॥లు, డోరు నెం. 81-33-4/3, శ్రీ సాయితేజ రెసిడెన్సీ, వాకర్స్ రోడ్డు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా.

పై పిటీషనరు మిమ్ములను పై ఈ.పి.లో వెంట్రపాటి రామకృష్ణరావు గారి వారసుడుగా పార్టీగా చేర్చమని దాఖలు చేసిన పై పిటీషను మీ హాజరు నిమిత్తము పై కోర్టులో ది. 16-10-2024వ సం॥రం తేదీకు వాయిదా అయి వున్నది. కావున మీరు పై కోర్టు ఎదుట **ది. 16-10-2024వ సం॥రం తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు ఎదుట హాజరై మీ అభ్యంతరములు తెలియపర్చుకో గలరు. లేని యెడల పై పిటీషను మీ పరోక్షమున నిర్ధారింపబడును.

యమ్.ఆర్.సత్యసాయి (రాంబాబు)
పిటిషనర్ తరపున అడ్వకేట్
డోరు నెం. 86-11-11/1, వాద్రేవునగర్ తిలక్‌రోడ్డు, రాజమహేంద్రవరం